సాక్షి చిత్తూరు

బుధవారం । 6 । డిసెంబర్ । 2023



స్వగృహ స్వప్నం నెరవేరె!

నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకం కింద స్వగృహ ప్రవేశం చేసిన లబ్ధిదారుల ఆనందం వారి మాటల్లోనే..

- 8లో



278.2 మి.మీ వర్షం

తుపాను ప్రభావంతో తిరుపతి జిల్లా చిట్టమూరు మండలంలో 278.2మి.మీ వర్షం కురిసింది.

- 8లో



ట్రాన్స్‌కోకు రూ.13కోట్ల నష్టం

తుపాన్ కారణంగా తిరుపతి జిల్లాలో ట్రాన్స్‌కోకు రూ.13 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఎస్పీడీసీఎల్ సీఎండీ తెలిపారు.

- 8లో

న్యూస్‌రీల్

అవగాహన కేంద్రం పరిశీలన



సూచనలిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల సంఘం సూచనల మేరకు ఈవీఎం, వీవీప్యాట్‌ల వినియోగంపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కేంద్రాన్ని జేసీ శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఓటింగ్ విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

11న గణితం పరీక్ష



హేమారెడ్డి, పరీక్షల విభాగం కార్యదర్శి

చిత్తూరు కలెక్టరేట్ : వర్షాల కారణంగా మంగళవారం జరగాల్సిన గణితం పరీక్షను 11వ తేదీన నిర్వహించాలని జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ హేమారెడ్డి ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం సైన్స్ పరీక్ష బుధవారం ఉంటుందని వెల్లడించారు


పకడ్బందీగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి

రొంపిచెర్ల : ఓటరు జాబితాను ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా తయారుచేయాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం రొంపిచెర్ల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ ఓటరు నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులు దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఓటరు జాబితాలో తప్పులు దొర్లితే బీఎల్‌ఓలదే బాధ్యతని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. వర్షాలకు కూలిపోయిన ప్రహరీ గోడను పరిశీలించారు. ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమరనాథ్, ఎంపీడీఓ రాజేంద్ర, డీటీలు వెంకటరమణారెడ్డి, లోకేష్, ఆర్‌ఐ అబ్దుల్ ఖాదిర్, వార్డెన్ సురేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



పేటూరు గ్రామంలో ఏనుగులు తొక్కేసిన వరి పైరు

పులిచెర్ల(కల్లూరు) : మండలంలోని చల్లావారిపల్లె పరిసర ప్రాంతాల్లో సాగు చేస్తున్న పంటలను మంగళవారం ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. కొబ్బరిచెట్లు, అరటి, వరి పంటలను నాశనం చేశాయి. ఏనుగుల కట్టడికి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని బాధిత రైతులు కోరుతున్నారు.

సోమల: మండలంలోని అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల్లో మంగళవారం వేకువజామున ఏనుగులు దాడి చేసి పంటలను నాశనం చేశాయి. ఏనుగులను అటవీప్రాంతంలోకి మళ్లించి తమ పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

16 నుంచి విద్య.. వైజ్ఞానిక ప్రదర్శనలు



విజయేంద్రరావు, డీఈఓ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఈ నెల 16వ తేదీ నుంచి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రదర్శనలకు అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఆదేశించారు. టీచర్ ఎగ్జిబిట్, విద్యార్థుల వ్యక్తిగత ఎగ్జిబిట్, గ్రూప్ ఎగ్జిబిట్‌గా మూడు విభాగాల్లో ప్రదర్శనలు ఉంటాయన్నారు. 16న పాఠశాల స్థాయి, 19న మండలస్థాయి, 22వ తేదీన జిల్లాస్థాయిలో ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఏర్పాట్లను డీవైఈఓ, ఎంఈఓలు పర్యవేక్షించాలన్నారు. ప్రతి మండలం నుంచి జిల్లా స్థాయికి తప్పనిసరిగా 9 ప్రాజెక్టులు పంపాలని స్పష్టం చేశారు. వివరాలకు సైన్స్ ఆఫీసర్ వెంకటరమణను 9701871545 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆదుకుంటూ.. అండగా నిలుస్తూ..!

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో మిచాంగ్ తుపాను బీభత్సం సృష్టించింది. పంట పొలాలను ముంచెత్తింది. రహదారులను ఛిద్రం చేసింది. లోతట్టు ప్రాంతాలను జలమయం చేసింది. భారీ వృక్షాలను నేలమట్టం చేసేసింది. విద్యుత్ స్తంభాలను పడగొట్టేసింది. ఈ క్రమంలో అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ బాధితులకు ఆపన్నహస్తం అందించింది. నిత్యావసర సరుకులతోపాటు ఆర్థిక సాయం పంపిణీ చేసింది. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నష్టనివారణ చర్యలను ముమ్మరం చేసింది.

- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు
- యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు
- క్షేత్రస్థాయిలో బాధితులకు నిత్యావసరాల పంపిణీ

రొంపిచెర్ల మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గాజులేరు



నగరి మండలంలో ఉప్పొంగుతున్న కుశస్థలి నది



చిత్తూరు అగ్రికల్చర్/నిండ్ర/పుత్తూరు/ నగరి/ చిత్తూరు కార్పొరేషన్/కార్వేటినగరం : మిచాంగ్ తుపాను ప్రభావంతో సోమవారం రాత్రి జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా కార్వేటినగరం మండలంలో 147.2 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా బైరెడ్డిపల్లెలో 0.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళవారం తుపాను ప్రభావం తగ్గుముఖం పట్టడంతో ఉదయం 10 గంటల వరకు పలు మండలాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి.

400 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

భారీ వర్షానికి జిల్లా వ్యాప్తంగా 400 హెక్టార్లలో పంటలు దెబ్బతినడంతో సుమారు రూ.461 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. మొత్తం 24 మండలాల్లోని 167 గ్రామాల పరిధిలో పంటలు నీట మునిగినట్లు వెల్లడించారు. నిండ్ర దళితవాడలోని శ్రీకృష్ణుడి ఆలయం వర్షాల తాకిడికి కూలిపోయింది.

కొట్టుకుపోయిన వంతెన

పుత్తూరు మండలంలో నేసనూరు–పైడిపల్లె మధ్య ఉన్న ఆర్‌అండ్‌బీ వంతెన వరద ఉధృతికి మంగళవారం వేకువజామున కొట్టుకు పోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే గోపాలకృష్ణాపురం వద్ద కల్వర్టుకు సమీపంలో రోడ్డు కోతకు గురైంది.

ముమ్మరంగా సహాయం



చింతపట్టెడ ఎస్టీ కాలనీలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి నియోజకవర్గంలోని తుపాను బాధితులను ఆదుకునేందుకు మంత్రి ఆర్కే రోజా పకడ్బందీ చర్యలు చేపట్టారు. బాధితులకు తానున్నానంటూ చేయూతనందించారు. మంత్రి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, ఎంపీపీ భార్గవి క్షేత్రస్థాయిలో పర్యటించారు. చింతలపట్టెడ ఎస్టీ కాలనీలోని ముంపువాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా 150 కుటుంబాలకు 5 కేజీల బియ్యం, నూనె, కంది పప్పు, కూరగాయలు పంపిణీ చేశారు.

నిండుగా కృష్ణాపురం జలాశయం

కార్వేటినగరం మండలంలో కుశస్థలీ నదిపై నిర్మించిన కృష్ణాపురం జలాశయం నిండు కుండలా మారింది. రిజర్వాయర్‌ను సందర్శించిన ఇరిగేషన్ ఏఈ రవీంద్రనాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం 200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందన్నారు. అందుకే జలాశయం నుంచి చెరువులకు నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని చెరువులను నీటితో నింపనున్నట్లు వివరించారు.



కృష్ణాపురం వాసులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఈఈ

తాగునీటి సరఫరాకు చర్యలు

తుపాను కారణంగా ప్రజలకు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని రూరల్ వాటర్ సప్లై ఈఈ టీవీ నరేంద్రకుమార్ ఆదేశించారు. మోటార్లు నీటమునిగినా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా, ప్రత్యామ్నాయ మార్గల ద్వారా నీరు అందించాలని స్పష్టం చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించాలని సూచించారు. ఈ క్రమంలోనే నగరి, విజయపురం మండలాల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్‌కుమార్ తెలిపారు.

పంటల పరిరక్షణకు ప్రాధాన్యం

భారీ వర్షాల కారణంగా పంట పొలాల్లో నిల్వ చేరిన నీటిని వెంటనే బయటకు పంపేందుకు చర్యలు చేపటాలని జిల్లా ఉదాన్యనశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. పంటల రక్షణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. మండలంలోని కొటార్వేడు, కేఎంపురం గ్రామాల్లో నీటమునిగిన పంటలను ఆయన పరిశీలించారు. వర్షానికి దెబ్బతిన్న పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు పొందాలని రైతులను కోరారు.



నిండ్రలో వర్షానికి కూలిపోయిన ఆలయం

విద్యుత్‌శాఖకు రూ.4.11 కోట్ల నష్టం

ఉమ్మడి జిల్లా పరిధిలో తుపాను కారణంగా రూ.4.11 కోట్ల నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు.



వరదలో కొట్టుకుపోతున్న బైక్‌ను జేసీబీతో బయటకు తీస్తున్న దృశ్యం



మిరప పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి



నీటమునిగిన వరిపైరును చూపుతున్న రైతు



సదుంలో దెబ్బతిన్న వరి పంట



పెనుమూరులో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

స్నేహపూర్వకంగా ‘ఆడుదాం’



పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్, పక్కన ఎమ్మెల్యే వెంకటేగౌడ



విజేతలకు ట్రోఫీ బహూకరిస్తున్న ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే వెంకటేగౌడ

కుప్పం : యువత స్నేహపూర్వకంగా ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొనాలని ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. మంగళవారం కుప్పం హాకింగ్ స్కూల్ మైదానంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పోటీల్లో వారు పాల్గొన్నారు. పలమనేరు, కుప్పం జట్ల మధ్య క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ క్రీడలను ప్రారంభించారు. ముందుగా చేపట్టిన క్రికెట్ పోటీలో పలమనేరు జట్టుకు ఎమ్మెల్యే వెంకటేగౌడ, కుప్పం టీమ్‌కు ఎమ్మెల్సీ భరత్ కెప్టెన్లుగా వ్యవహరించారు. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పలమనేరు 15 ఓవర్లకు 119 పరుగులు చేసి ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కుప్పం జట్టు 10 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 120 రన్స్‌తో గెలుపొందింది. అనంతరం ఖోఖో, బ్యాడ్మింటన్‌లో కుప్పం, వాలీబాల్, కబడ్డీలో పలమనేరు విజయం సాధించాయి. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పోటీలకు శ్రీకారం చుట్టిందన్నారు. యువత క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఎల్‌ఏ నిబంధనలు తప్పనిసరి



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : అసైన్‌మెంట్ భూముల కసరత్తులో సీసీఎల్‌ఏ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి పలు శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో మహిళలు పాల్గొనే చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద అభివృద్ధి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను త్వరితగతిన ఆయా మండలాలకు చేర్చాలని సూచించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో నమోదైన అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఎన్నికల కసరత్తులో ఎలాంటి తప్పిదాలు ఉండకూడదని కోరారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ రాజశేఖర్, ఏఓ కులశేఖర్ పాల్గొన్నారు.

పుంగనూరులో సోలార్ ప్లాంట్

– రూ.6 కోట్లతో నిర్మాణం



భూమిపూజ చేస్తున్న నాగభూషణం, అలీమ్‌బాషా

పుంగనూరు : పట్టణంలోని సమ్మర్ స్టోరేజీ వద్ద సోలార్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, కమిషనర్ నరసింహప్రసాద్, జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. నాగభూషణం మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు రూ.6కోట్లతో సోలార్ ప్లాంట్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు నెల రోజుల్లోపు ప్లాంట్ పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ ప్రస్తుతం ప్రతి నెలా రూ.35లక్షల వరకు విద్యుత్ బిల్లులు చెల్లిస్తోందని, సోలార్ ప్లాంట్ అందుబాటులోకి వస్తే నిధులు ఆదా అవుతాయని వివరించారు. ఆ మేరకు మిగులు నిధులను పురపాలక అభివృద్ధికి వినియోగించేలా మంత్రి పెద్దిరెడ్డి ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము పాల్గొన్నారు.

గంగమ్మా..దీవించమ్మా

- ఏడు గంగమ్మలకు ముక్కంటి సారె

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలోని ఏడుగంగమ్మల జాతరను పురస్కరించుకుని మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాయం తరపున సారె సమర్పించారు. ఆలయ అలంకారమండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మండపం వద్ద సారెను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయంలోని పాతాళ గణపతి ఆలయం వద్ద వాహన మండపం ద్వారా ఊరేగింపుగా బయటకు వచ్చి గాలిగోపురం, తేరువీధి, బియ్యపు కృష్ణారెడ్డి మండపం, పెండ్లిమండపం, ముత్యాలమ్మగుడివీధి మీదుగా ఏడుగంగమ్మల గుడి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలు సారె సమర్పించేందుకు వెళుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, సతీమణి శ్రీవాణిరెడ్డి, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాదాలు కడిగి స్వాగతం పలికారు. అనంతరం ఏడుగంగమ్మల గుడి వద్ద సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఏడు గంగమ్మలను ప్రతిష్టించి ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో ఈవో కేఎస్.రామారావు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ముక్కంటి సారె తీసుకువస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్



విశేషాలంకరణలో గంగమ్మ

ఫలితాల విడుదల

చిత్తూరు అర్బన్: జిల్లాలోని దిశ పోలీస్ స్టేషన్‌లలో ఔట్ సోర్సింగ్ డ్రైవర్ పోస్టులకు నిర్వహించిన ఇంటర్వ్యూ ఫలితాలను ఎస్పీ రిషాంత్‌రెడ్డి మంగళవారం విడుదల చేశారు. పి.విశ్వనాథ్‌రెడ్డి, శోభన్ బాబు, దిలీప్‌రెడ్డి వి.లోకేష్ ధనంజయ్య, ఎం.శ్రీనివాసులు నాయక్ ఎంపికైనట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్‌ఐలు మల్లికార్జున, భారతి మీడియాకు వివరాలు వెల్లడించారు. స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుకవైపు గంజాయి విక్రయాలు సాగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సోమవారం మధ్యాహ్నం ఎస్‌ఐ మల్లికార్జున తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. వినాయకపురానికి చెందిన రిజ్వాన్, సౌకార్‌పేటకు చెందిన అన్సర్ అనే ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి సరఫరా చేసిన జానకారపల్లెకు చెందిన రహంతుల్లాను సైతం అరెస్ట్ చేసి మరో 4 కిలోల గంజాయి సీజ్ చేశారు. రహంతుల్లాకు గంజాయి విక్రయించిన మహిళ కోసం గాలింపు చేపట్టారు. ముగ్గురు నిందితుల నుంచి మొత్తం రూ.3లక్షల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

చైన్‌స్నాచర్ అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పుత్తూరు: పట్టపగలే ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు .. పరమేశ్వరమంగళం గ్రామంలోని నాగరత్నమ్మ అనే వృద్ధురాలి ఇంట్లోకి ఈ నెల 2వ తేదీ సాయంత్రం ఓ దుండగుడు చొరబడి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. బాధితురాలి భర్త మునస్వామినాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన ఆర్.రంజిత్‌రావు(22) అనే ఎల్‌ఎల్‌బీ విద్యార్థి నిందితుడిగా గుర్తించారు. సోమవారం సాయంత్రం వేపగుంట క్రాస్ వద్ద నిందితుడు బస్సు ఎక్కుతుండగా అదుపులోకి తీసుకున్నారు. రూ.1.20 లక్షలు విలువ చేసే బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు తమిళనాడుకు చెందిన అరియలూరు జిల్లా, కులత్తూర్ గ్రామానికి చెందిన వ్యక్తి. పరమేశ్వరమంగళంలోని కేకేసీ కళాశాలలో ఎల్‌ఎల్‌బీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై ఇలా దొంగతనానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడించాడు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

రేణిగుంట: రేణిగుంట అర్బన్ స్టేషన్ పరిధిలో ఇటీవల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి 175 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఆ వివరాలను విలేకరులకు వివరించారు. పట్టణంలోని పాంచాలినగర్, వెదుళ్లచెరువు, అన్నాసామిపల్లిల్లోని ఇళ్లల్లో జరిగిన చోరీ కేసుల దర్యాప్తులో భాగంగా నిందితులను రేణిగుంట రమణవిలాస్ సర్కిల్ వద్ద సోమవారం పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఆయన వివరించారు. నిందితులు తమిళనాడు రాష్ట్రం తేని, దిండిగళ్ ప్రాంతాలకు చెందిన ఎం.గురునాథం(37), ఏ.పాలిస్వామి(70), ఎం.మయాకాళై(57), ఏ.కరుణానిధి(55)గా గుర్తించినట్లు వివరించారు. వారి వద్ద ఉన్న 175 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి తాళాలు వేసిన ఇళ్లల్లోకి చొరబడి చోరీలకు పాల్పడేవారన్నారు. వీరిపై తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో పలు దొంగతనాల కేసులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

స్వగృహ స్వప్నం నెరవేరే!

మనది అంటూ ఒక ఇల్లు ఉంటే.. అది మన సొంతమే అయితే.. ధీమాగా బతుకు బండి నడిపించవచ్చు.. మనశ్శాంతిగా మనుగడ సాగించవచ్చు. ప్రతి ఒక్కరి కల ఇది. నిరుపేదలకు మాత్రం నెరవేరని స్వప్నం ఇది. అలాంటి స్తోమత లేని వారి కలలను సైతం ప్రభుత్వం సాకారం చేస్తోంది. అందరికీ గూడు కల్పించేందుకు నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం తీసుకువచ్చింది. అత్యాధునిక మౌలిక వసతులతో తీర్చిదిద్దిన జగనన్న లేఅవుట్లలో ఆశ్రయం అందిస్తోంది. స్వగృహ స్వప్నాలను నెరవేరుస్తోంది. ప్రతిష్టాత్మక పథకం ద్వారా ఇళ్లు పొందిన లబ్ధిదారుల ఆనందం వారి మాటల్లోనే..

– చిత్తూరు కలెక్టరేట్

జనవాక్కు


ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు

రుణపడి ఉంటాం



మా నాన్న కట్టిన పాత పెంకుటింట్లో నివసించేవాళ్లం. ఉన్న కొంత భూమిలో సాగు చేస్తూ వచ్చే ఆదాయంతో మేం బతకడానికే ఇబ్బందిగా ఉండేది. వర్షాకాలంలో ఇల్లు ఉరుస్తుంటే కింద బకెట్లు పెట్టి రాత్రుల్లో నిద్ర లేకుండా గడిపేవాళ్లం. సొంత ఇల్లు కట్టే ఆలోచన కూడా లేదు. జగనన్న అధికారంలోకి వచ్చాక మాకు పక్కా ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. అమ్మ ఒడి, రైతు భరోసాతోపాటు మరి కొంత డబ్బు సర్దుకుని మంచిగా ఇల్లు నిర్మించుకున్నాం. మేము పడిన ఇక్కట్లు మా బిడ్డలు పడకుండా జగనన్న పుణ్యం కట్టుకున్నాడు. ఆయనకు రుణపడి ఉంటాం.

– మునివీరప్ప, ఎం.శాంతంపల్లె, శాంతిపురం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



సొంత ఇల్లు కట్టుకుంటామని మా కలలో కూడా ఊహించలేదు. చాలీచాలని వ్యవసాయం చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటూ జీవన సాగించడమే భారంగా ఉండేది. ఈ తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తమ కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచి పక్కా ఇల్లు మంజూరు చేశారు. ఆయన దయతోనే మేము ఈరోజు సొంత ఇల్లు కట్టుకుని పిల్లలను చదివించుకుంటూ ఆనందంగా ఉంటున్నాం. ఇంత మేలు చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– రెడ్డమ్మ, తాటిమోకులపల్లె, పెనుమూరు మండలం

జీవితాంతం మరువలేం



కూలి చేసుకుంటూ పొట్టపోసుకునే పరిస్థితి మాది. ఏళ్ల తరబడి పూరి గుడిసెలోనే నివసించాం. గతంలో ఎన్నికల వస్తే అది చేస్తాం, ఇది చేస్తామని మా ఇళ్ల వద్దకు వచ్చే రాజకీయ నాయకులనే చూశాం. వారిని నమ్మి ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించిన తర్వాత ఏ మాత్రం పట్టించుకోకుండా మోసం చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఉచితంగా ఇంటి స్థలం ఇచ్చారు. సిమెంట్, ఇసుక కూడా ఉచితంగా ఇచ్చారు. ఇల్లు కూడా కట్టించారు. ఆయన మేలును జీవితాంతం మరువలేం.

– కృష్ణమ్మ, కట్టకిందఊరు, యాదమరి మండలం

ఆనందంగా ఉంది



నా భర్త వెంకటేష్ దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. సంపాదన అంతంత మాత్రమే. అది కాస్తా పిల్లల చదువుకు, కుటుంబ పోషణకే సరిపోయేది. దీంతో ఉమ్మడి కుటుంబంలోనే ఉంటూ వచ్చాం. ఇలా 20 ఏళ్లు గడిచిపోయాయి. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వలంటీర్ మా దగ్గరకు వచ్చి ఇంటికోసం దరఖాస్తు చేయించారు. వెంటనే ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలకు తోడు మేము కూడబెట్టిన కొద్దిపాటి సొమ్ముతో అందంగా ఇల్లు నిర్మించుకున్నాం. సొంతింటిలో ఉంటే ఎంతో ఆనందంగా ఉంది.

– రామలక్ష్మి, విజయపురం

నూర్పిడి యంత్రంలో పడి యువతి మృతి


ప్రియాంక మృతదేహం

గుడుపల్లె : వరి నూర్పిడి యంత్రంలో చిక్కుకుని ప్రియాంక (19) అనే యువతి మృతి చెందిన ఘటన మంగళవారం గుడుపల్లె మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మీకాంత్ కథనం మేరకు.. శాంతిపురం మండలం కర్లగట్ట గ్రామానికి చెందిన మునస్వామి కుమార్తె ప్రియాంక గుడుపల్లె మండలం సొన్నార్లనపల్లెకు చెందిన శ్రీనివాసులు కుమార్తె హిందు స్నేహితులు. వారం క్రితం ప్రియాంక తన స్నేహితురాలు హిందు ఇంటికి వచ్చింది. వ్యవసాయ పనుల్లో భాగంగా వరి పంటను కోసి నూర్పిడి చేసేందుకు ఇద్దరూ పొలం వద్దకు వెళ్లారు. ప్రియాంక నూర్పిడి యంత్రంపై కుర్చొని వరి వాదిని కట్టలను వదులుతోంది. ఇంతలో ప్రియాంక ఓణీ నూర్పిడి యంత్రంలో చిక్కుకుని తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మరణించింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి


రామకృష్ణ (ఫైల్)

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట–పలమనేరు మార్గంలోని దాసనంపల్లె బస్‌స్టాప్ వద్ద సోమవారం రాత్రి ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. దాసనంపల్లెకు ఆలేటి రామకృష్ణ(55) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పని ముగించుకుని స్వగ్రామానికి నడిచి వెళుతుండగా నడింపల్లె గ్రామానికి వెళుతున్న దిలీప్ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంతో వేగంగా ఢీ కొన్నాడు. క్షతగాత్రుడిని వెంటనే పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేస నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

వాగులో పడి బాలుడి గల్లంతు

తిరుపతి మంగళం: తిరుపతి మంగళం సమీపంలో సీఎస్ఎన్.మహాలక్ష్మి గార్డెన్స్ వద్ద వాగులో పడి నిఖిల్ (10) గల్లంతయ్యాడు. వివరాలు.. తిరుపతి నగర పరిధి జీవకోనలోని సంతోషమ్మనగర్‌కి చెందిన కె.ఆనంద్, చిట్టీ కుమారుడు నిఖిల్. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో చేపల కోసమని మేనమామ ప్రభాకర్‌రెడ్డి, తాత, అతని స్నేహితులతో కలిసి వాగు వద్దకు చేరుకున్నారు. నీటి వేగం ఎక్కువగా ఉండడంతో పిల్లలను వాగుకు దూరంగా ఉండాల్సిందిగా అక్కడున్నవారు సూచించారు. అయితే నిఖిల్ మాత్రం వాగులోకి దిగాడు. ప్రవాహ వేగానికి కొట్టుకుపోయాడు. అయితే ఈ విషయం అతని బంధువులు ఎవ్వరూ గమనించలేదు. కొంత సమయానికి బాలుడు కనిపించకపోవడంతో కంగారుపడ్డారు. సమీపంలో చేపలు పడుతున్న కొందరు.. ఎవరో చిన్నపిల్లవాడు నీటిలో కొట్టుకుపోతున్నాడని చెప్పారు. వెంటనే అప్రమత్తమైన బంధువులు వాగుపొడవునా గాలించారు. అయినా బాలుడి జాడ కనిపించలేదు. తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకున్న ఎస్‌ఐ జగన్నాథరెడ్డి స్థానికులతో కలిసి రాత్రి పొద్దుపోయేవరకు గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. బాలుడి తల్లిదండ్రులు బిడ్డకోసం తల్లడిల్లిపోతున్నారు.

చిట్టమూరులో 278.2 మి.మీ వర్షం


సూళ్లూరుపేట వద్ద మహోగ్రంగా ప్రవహిస్తున్న కాళంగి నది


సూళ్లూరుపేట : పాములకాలువ వరదలో మునిగిన పడమటకండ్రిగ పంట పొలాలు

తిరుపతి అర్బన్: జిల్లాలో మంగళవారం ఉదయం చిట్టమూరులో అత్యధికంగా 278.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది జూన్ నుంచి డిసెంబర్ వరకు 940.1 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటివరకు 1,025.9 మి.మీ వర్షపాతం నమోదైనట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి జిల్లా స్పెషల్ ఆఫీసర్ శ్యామలరావుకు వివరించారు.

కలిచేడు చెరువుకు గండి

సైదాపురం: సైదాపురం సమీపంలో కైవల్యా, కమాండ్ నీటి వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సైదాపురం–గూడూరు మార్గంలో రాకపోకలు స్తంభించారు. అలాగే తురిమెర్ల వద్ద పిన్నేరు, ఊటుకూరు వద్ద ఉన్న మాలేరు, శమాయిన్ వద్ద ఉన్న సిద్ధల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సైదాపురం– పొదలకూరు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ కార్యాల య సబ్‌స్టేషన్ వద్ద ఉన్న చెట్లు నేలకొరిగాయి. కలిచేడు చెరువుకు గండి పడడంతో నీరు వృథాగా పోయింది. వేమనచేడు, పాలూరు, అనంతమడుగు, వెంకటరెడ్డిపల్లి, కమ్మవారిపల్లి, రామసాగరంలోని పంట పొలాలు నీటమునిగాయి. సుమారు 25 ఎకరాల్లో బొప్పాయి నీటమునిగింది. నిమ్మచెట్లు దెబ్బతిన్నాయి. 150 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 20 ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోయాయి. విద్యుత్‌శాఖకు సుమారు రూ.40 లక్షల వరకు నష్టం వాటిల్లింది. సైదాపురం మండలంలో ఏర్పాటు చేసిన 8 పునరావస కేంద్రాల్లో బాధితులకు తహసీల్దార్ నాగినేని శ్రీనివాసులు ఆహారం అందించారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న కమాండ్ గెని ఏరు


నీటమునిగిన చవక

అరణియార్ ఎడమ కాలువ అక్విడెక్‌కు గండి

పిచ్చాటూరు: పిచ్చాటూరు అరణియార్ ఎడమ కాలువ అక్విడెక్‌కు గండి పడింది. దీంతో కాలువ గుండా ప్రవహించాల్సిన నీరు అరుణానదిలో కలిసిపోతోంది. రెప్పాలపట్టు నుంచి అడవికండ్రిగ గ్రామానికి వెళ్లే రోడ్డు వరద నీటికి కొట్టుకుపోయింది. అడవికండ్రిగ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అరణియార్ గేట్లను పుత్తూరు డీఎస్పీ శ్రీనివాస రావు పరిశీలించారు. ఆయనతోపాటు సీఐ కె.లక్ష్మీనారాయణ ఉన్నారు. ఇదిలా వుండగా మంగళవారం సాయంత్రానికి వరద నీరు తగ్గడంతో అరణియార్ గేట్ల ద్వారా విడుదల చేసే నీటిని 2 వేలుకు తగ్గించారు. పిచ్చాటూరు–శ్రీకాళహస్తి మధ్య రాకపోకలకు అనుమతించారు.

కాళంగి ఉగ్రరూపం

కేవీబీపురం : మండలంలోని కాళంగి రిజర్వాయర్‌కు వరదనీరు భారీగా చేరింది. ప్రస్తుతం 44,000 క్యూసెక్కుల నీరు డ్యామ్‌కు చేరుతోంది. దీంతో 10 మినీ గేట్లు, మూడు ప్రధాన గేట్లను ఎనిమిది అడుగులు మెరా ఎత్తి 40,000 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రధాన గేట్లను ఎత్తివేయడంతో జయలక్ష్మీపురం, అంజూరుపాళెం గ్రామాల మధ్య వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మరో 15 రోజుల పాటు చుట్టుపక్కల నాలుగు గ్రామాలకు బాహ్యాప్రపంచంతో సంబంధాలు తెగిపోనున్నాయి.


కాళంగి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేస్తున్న దృశ్యం

అప్రమత్తంగా ఉండాలి


సిబ్బందికి సూచనలిస్తున్న సుబ్బరాజు

ఏర్పేడు: వర్షాకాలం ప్రజలు, రైతులకు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని తిరుపతి ఎస్పీడీసీఎల్ సాంకేతిక డైరెక్టర్ సుబ్బరాజు సిబ్బందిని ఆదేశించారు. ఆయన ఏర్పేడు ఎస్పీడీసీఎల్ ఉప కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఎస్పీడీసీఎల్ ఏఈ వాసుదేవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్పోర్ట్స్ అధికారి నియామకంపై హర్షం


షేక్ సయ్యద్‌ను సత్కరిస్తున్న ఒలిపింక్ అసోసియేషన్ నేతలు, శాప్ శిక్షకులు

తిరుపతి కల్చరల్: ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల ముఖ్య క్రీడాశిక్షకుడిగా, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ పరిపాలనాధికారిగా అనేక ఏళ్లు ఉత్తమ సేవలందించిన షేక్ సయ్యద్ సాహెబ్ నియామకం అభినందనీయమని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై.ప్రవీణ్ తెలిపారు. ఈమేరకు మంగళవారం శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో షేక్ సయ్యద్ సాహెబ్‌ను ఘనంగా సత్కరించారు. సత్కరించినవారిలో ఒలిపింక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీధర్, కోశాధికారి జీఎస్.సాయికుమార్, జిల్లా శాప్ శిక్షకులు ఆదినారాయణ, హిందూజ, సాయి సుమతి, నీలిమ, విజయమోహన్‌రెడ్డి, సూర్యకళ ఉన్నారు.

ట్రాన్స్‌కోకు రూ.13 కోట్ల నష్టం


నాయుడుపేటలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లోని ఆయా ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు తెలిపారు. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన విద్యుత్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షించారు. కర్నూలు, అనంతపురం, కడప సర్కిళ్ల నుంచి 360 మంది విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు నెల్లూరు సర్కిల్‌కు చేరుకున్నాయని వివరించారు. భారీ వర్షాల కారణంగా సంస్థ పరిధిలోని నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లోని 6 పట్టణాలకు, 1,119 గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. సంస్థ పరిధిలో 33 కెవి సబ్ స్టేషన్లు 305, 33కెవి ఫీడర్లు 184, 11కెవి ఫీడర్లు 1220 మరమ్మతుకు గురయ్యాయని, 33కెవి విద్యుత్ స్తంభాలు 835, 11కెవి విద్యుత్ స్తంభాలు 3,272, ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు 2,290, 69కి.మీ. మేర 33కెవి లైను, 206 కి.మీ.మేర 11కెవి లైను, 123కి.మీ. మేర ఎల్‌టీ లైను, 1 పవర్ ట్రాన్స్‌ఫార్మర్, 1,268 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతినడం ద్వారా 11.52 లక్షల విద్యుత్ సర్వీసులు, 1.56 లక్షల వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. తద్వారా సంస్థకు సుమారు రూ.13 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. సరఫరాలో అంతరాయం ఏర్పడిన సర్వీసుల్లో మంగళవారం సాయంత్రానికి 1.81 లక్షల విద్యుత్ సర్వీసులు, 5,425 వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సరఫరాను పునరుద్ధరించామన్నారు. ఎక్కడైనా అత్యవసరమైతే టోల్ ఫ్రీ నంబర్లు–1912 లేదా 1800425155333 కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. సంస్థ వాట్సాప్ నంబరు 91333 31912కు తెలియజేయాలని సూచించారు.